

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్ ప్రమాణ స్వీకారం సందర్భంగా గాంధీభవన్‌లో సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నృత్యాలు చేస్తూ ఆనందంలో మునిగిపోయారు.

ఫొటోలు: స్టాఫ్‌ఫొటో గ్రాఫర్, ఆంధ్రజ్యోతి



రాజ్యాంగం ప్రపంచ దేశాలకు మార్గదర్శకం



ఉచిత వైద్య శిబిరంలో మాట్లాడుతున్న కమాండెంట్ మురళీకృష్ణ



రౌండ్‌టేబుల్ పాఠశాలలో చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మాల వెలుగు సంఘం నాయకులు

యూసుఫ్‌గూడ/బోరబండ/బంజారాహిల్స్/ఖైరతాబాద్/బేగంపేట/ఎర్రగడ్డ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని, మొదటి పటాలపు కమాండెంట్ పి.మురళీకృష్ణ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బెటాలియన్‌లో మెడికవర్ ఆస్పత్రి సహకారంతో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్‌లు రాంబాబు, కేవీవీ ప్రసాద్, నర్సింహ, ఆర్‌ఐలు కృష్ణార్జునరావు, నాగేశ్వరరావు, రాజేష్, సాంబయ్య, రమేష్‌బాబు, ఆర్ఎస్ఐలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

- బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.5 దేవరకొండ బస్తీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ ఎలిగల మహేష్ యాదవ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్వీ నాయకుడు మధుకర్ యాదవ్, టీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బరిగెల వెంకట్‌స్వామి, ఉపాధ్యక్షులు మన్నెం వీరస్వామి, ఎమ్మార్పీఎస్ ఖైరతాబాద్ ఇన్‌చార్జి కృష్ణమూర్తి, దోరపల్లి రమేష్ పాల్గొన్నారు. ఫిలింనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాల వెలుగు సంఘం ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుమంత్, మాల వెలుగు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మణ్, నాయకులు మన్యం, మునీందర్, వెంకటయ్య, రాములు, మధు పాల్గొన్నారు.
- బోరబండ బలహీన వర్గాల కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ కార్యకర్తలు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు టి.కృష్ణమోహన్, నాయకులు ఎన్.విజయ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు దేవమణి, విజయ, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి వసంతరావు, మల్లేష్, పావనం శివశంకర్, కె.బాబురావు, శేఖర్ పాల్గొన్నారు. ఖైరతాబాద్ గ్రంథాలయ చౌరస్తాలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి అఖిలపక్షాల నేతలు గజ్జెల ఆనంద్, కమ్మరి వెంకటేష్, పంజాగుట్టలోని అంబేడ్కర్ విగ్రహానికి మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్, భానుప్రకాశ్, విజయ్‌కుమార్ నివాళులర్పించారు.
- ఎర్రగడ్డ ప్రేమ్‌నగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ సంఘం అధ్యక్షుడు ఎర్ర కృష్ణ కుమార్, దళిత సంఘాలు, పలు పార్టీల నాయకులు మహ్మద్ మోసిన్ ఖురేషి, పోతురాజు నర్సింగ్‌రావు, ఎస్.శివశంకర్, రాజేష్ సాహెూ, మహ్మద్ అబ్దుల్, పి.రాజు, రాజాసింగ్, శేఖర్, రామ్‌లాల్ నివాళులర్పించారు.



దేవరకొండ బస్తీలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్, టీఎంఎస్ మన్నెం వీరస్వామి



ప్రేమ్‌నగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత నాయకులు

రాజ్యాంగానికి విఘాతం కలిగిస్తే భూస్థాపితం



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన రాంచందర్, నాయకులు

పంజాగుట్ట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగానికి విఘాతం కలిగిస్తున్న రాజకీయ పార్టీలను భూస్థాపితం చేస్తామని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ గౌరవ చైర్మన్ చెరుకు రాంచందర్ హెచ్చరించారు. జాతీయ న్యాయ దినోత్సవం, భారత సంవిధాన్ దివస్ సందర్భంగా బుధవారం పంజాగుట్ట చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి జేఏసీ, వివిధ సంఘాల నాయకులతో కలిసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్టూడెంట్ జేఏసీ చైర్మన్ మాదాసు రాహుల్ రావు,వైస్ చైర్మన్ సఖి గంగాధర్, డాక్టర్ వీరస్వామి, తెలంగాణ మాల సమితి అధ్యక్షుడు బరిగెల వెంకటస్వామి, బిట్ల శ్రీనివాస్, వీరస్వామి పాల్గొన్నారు.

లక్ష సభ్యత్వ నమోదు

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా లక్ష సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(అథవాలే) జాతీయ ప్రధాన కార్యదర్శి పేరం శివనాగేశ్వరరావు తెలిపారు. పార్టీ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పీబీఆర్ గౌడ్‌తో పాటు పార్టీలో చేరిన పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ నాయకుడు ప్రభుదాస్, రాష్ట్ర నాయకులు రవికుమార్, రత్నప్రసాద్, గోరఖ్‌సింగ్, స్నేహలత, పద్మ, రోజారాణి, శివరాజు, జగన్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

కార్మిక, కర్షక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

బోరబండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక, కర్షక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ ఆధ్వర్యంలో ఎస్పీఆర్ హిల్స్ రెండుబొమ్మల కూడలిలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ప్రజాసంఘాల నాయకుడు టి.సాయిశేషగిరిరావు, సీఐటీయూ రహ్మత్ నగర్ డివిజన్ ప్రధానకార్యదర్శి దేవదాస్ మాట్లాడుతూ 29 కార్మిక రక్షణ చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. ఈనెల 21 నుంచి అమలు చేస్తున్న కోడ్‌లు కార్మికులకు రక్షణగా ఉంటాయని ప్రధానమంత్రి చెప్పడం పూర్తి అబద్ధమని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు దేవదాస్, జైపాల్, భాగ్యరాజ్, లాలూ యాదవ్, కేశప్ప యాదవ్, శివ యాదవ్, రాజు, మల్లేష్, లాలప్ప పాల్గొన్నారు.



దీపక్ జాన్‌ను సన్మానిస్తున్న డాక్టర్ రవీందర్‌గౌడ్

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

అమీర్‌పేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని ఆ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు దీపక్ జాన్ పిలుపునిచ్చారు. బల్కంపేటకు చెందిన శంకర నేత్రాలయం అధినేత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ రవీందర్‌గౌడ్ బుధవారం ఆయన నివాసంలో దీపక్ జాన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా దీపక్ జాన్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కమలరాజు, బాబు పాల్గొన్నారు.

బోరబండలో గంజాయి విక్రయాలు

- **నిందితుడి అరెస్ట్**



నిందితుడిని పట్టుకున్న పోలీసులు, చిత్రంలో స్వాధీనం చేసుకున్న గంజాయి

హైదరాబాద్ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బోరబండలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు రంగంలోకి దిగి స్మగ్లర్‌తోపాటు 1.2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ ప్రాంతానికి చెందిన రహమాన్ ధూల్‌పేట సహా పలు ప్రాంతాల్లో గంజాయిని కొనుగోలు చేసి చిన్న, చిన్న ప్యాకెట్లుగా చేసి గుట్టుగా వినియోగదారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎస్టీఎఫ్ సీఐ భిక్షారెడ్డి, ఎస్సై బాలరాజు టీమ్ రంగంలోకి దిగింది. బోరబండలో మాటువేసి నిందితుడిని పట్టుకున్నారు. అతడి నుంచి 84 చిన్న గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అతడికి సహకరించిన మరో నిందితుడు హుస్సేన్ పారిపోయారు. పట్టుకున్న నిందితుడిని, గంజాయిని బాలానగర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

పెళ్లి చేసుకుంటానని మోసం

యూసుఫ్‌గూడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రేమపేరుతో దగ్గరై, పెళ్లి చేసుకుంటానని యువతికి మాయమాటలు చెప్పి శారీరకంగా వాడుకొని యువకుడు మోసం చేశాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ పరిధిలో నివసించే ఓ యువతికి కేరళకు చెందిన జాఫర్ హారీఫ్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమయ్యాడు. ప్రేమపేరుతో దగ్గరయ్యాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకున్నాడు. యువతికి సంబంధించిన ఐఫోన్‌తోపాటు బంగారు ఆభరణాలను అవసరాల కోసం అమ్ముకున్నాడు. పెళ్లి చేసుకోమని యువతి గట్టిగా పట్టుబట్టడంతో ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో యువతి మధురానగర్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రేమపేరుతో బాలికపై లైంగిక దాడి

- **యువకుడిపై కేసు నమోదు**

బంజారాహిల్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రేమపేరుతో బాలికపై ఓ యువకుడు పలుమార్లు లైంగిక దాడి చేసి గర్భవతిని చేశాడు. ముఖం చాటేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిలింనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఉండే బాలికకు రెండు సంవత్సరాల క్రితం వాటర్ బాటిల్స్ సరఫరా చేసే సూరపల్లి రాజేష్‌తో పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికపై పలుమార్లు లైంగిక దాడి చేశాడు. బాలిక గర్భం దాల్చగా రెండు సంవత్సరాల తర్వాత పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఇప్పుడు పెళ్లి చేసుకోమంటే ముఖం చాటేస్తున్నాడు. మోసపోయినట్టు గ్రహించిన బాలిక ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు రాజేష్ పై 64(2), 69, 89, 351(2) పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

- **ఒకరికి గాయాలు**

యూసుఫ్‌గూడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వెనక నుంచి వేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపురి కాలనీకి చెందిన బి.శివరామిరెడ్డి ద్విచక్ర వాహనంపై కేకే పార్కు వైపు వెళ్తున్నాడు వెనక నుంచి వేగంగా వచ్చిన కారు(టిఎస్ 08ఎఫ్ జి 5827) ఢీకొట్టడంతో శివరాంరెడ్డి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో కుడి భుజం విరిగింది. తీవ్ర గాయాలు కావడంతో సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈయన అల్లుడు నవీన్ కుమార్ బుధవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

టిప్పర్ ఢీకొని యువకుడికి గాయాలు

బోరబండ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని యువకుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హిమాయత్ నగర్ ప్రాంతానికి చెందిన తబ్రేజ్ ఖాన్(31) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా సారథి నగర్ సులభ్ కాంప్లెక్స్ వద్ద వెనక నుంచి వచ్చిన ఇసుక టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిందపడిన యువకుడి కుడికాలు, కుడి భుజానికి గాయాలయ్యాయి. బాధితుడి సోదరుడు జాహీద్ ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌టీఏ కార్యాలయానికి స్థలం కేటాయింపు

హైదర్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి ఆర్‌టీఏ ఆఫీస్‌కు స్థలం కేటాయిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కూకట్‌పల్లి ఎంవీఐ శ్రీనుబాబు ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-4లో నడుస్తున్న ఆర్‌టీఏ కార్యాలయాన్ని హెచ్‌ఎండీఏకు చెందిన కూకట్‌పల్లి సర్వే నంబర్ 155/పిలో 25గుంటల స్థలాన్ని కేటాయించారు. కొత్త స్థలంలో త్వరలోనే ఆర్‌టీఏ కార్యకలాపాలు కొనసాగిస్తామని కూకట్‌పల్లి ఏవీఐ శ్రీనుబాబు పేర్కొన్నారు.

అరుదైన శస్త్రచికిత్స

- **మహిళ కడుపులోంచి 8 కిలోల కణతి తొలగింపు**

ఖైరతాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వాసవి ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స చేశారు. మహిళ పొట్టలోంచి 8 కిలోల కణతిని తొలగించారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ హజరతయ్య ఈ అరుదైన శస్త్ర చికిత్సను స్లీవ్ గ్యాస్ట్రెక్టమీ పద్ధతిలో మూడు గంటలపాటు చేశారు. బుధవారం ఆస్పత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో శస్త్ర చికిత్సకు సంబంధించిన వివరాలను డాక్టర్ హాజరతయ్య వెల్లడించారు. నగరానికి చెందిన 58 సంవత్సరాల మహిళ విపరీతమైన కడుపునొప్పి, ఆహారం తీసుకోకలేకపోవడం వంటి సమస్యలతో రెండు రోజుల క్రితం వాసవి ఆస్పత్రికి వచ్చింది. డాక్టర్ హజరతయ్య నేతృత్వంలో ఆమెను పరీక్షించి, ఎంఆర్ఐ పరీక్ష చేయడంతో కడుపులో భారీ గడ్డ ఉన్నట్లు గుర్తించారు. మంగళవారం ఆమెకు స్లీవ్ గ్యాస్ట్రెక్టమీ పద్ధతిలో కడుపులోని గడ్డను తొలగించినట్లు తెలిపారు. సమావేశంలో అనస్థిటిస్ట్ డాక్టర్ శ్రీవాణి టీం, వాసవి ఆస్పత్రి చైర్మన్ కె.జయప్రకాశ్ రాం, ప్రధాన కార్యదర్శి కొండ్లె మల్లికార్జున్, కోశాధికారి ఎం.దయాకర్‌గుప్తా, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్‌రావు పాల్గొన్నారు.

గ్రీన్‌ల్యాండ్ డివిజనల్ ఇంజనీర్‌గా కృష్ణారావు



కృష్ణారావు

బేగంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ లాండ్స్ ఆపరేషన్ విభాగం డివిజనల్ ఇంజనీర్‌గా కృష్ణారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన భీమా నాయక్‌ను మహబూబ్‌నగర్ ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్‌గా నియమించారు.

ఎలక్ట్రానిక్, ఐరన్ వస్తువుల వేలంపాట

యూసుఫ్‌గూడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్పెషల్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ శౌర్య భవన్‌లో నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలు, ఐరన్ వస్తువులు, కార్యాలయ వస్తువులను ప్రభుత్వ నిబంధనల ప్రకారం డిసెంబరు 3న వేలంపాట వేస్తున్నామని అడిషనల్ కమాండెంట్ ఎస్‌ఓ రామకృష్ణ తెలిపారు. ఆసక్తి ఉన్న వ్యక్తులు, వ్యాపార సంస్థలు, పాత ఇనుప సామాను దుకాణదారులు, డీలర్‌లు వేలంపాటలో పాల్గొనవచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం 8712658532లో సంప్రదించాలని ఆయన సూచించారు.

జాతీయ చేతిరాత పోటీలు

పంజాగుట్ట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చేతిరాత ప్రాముఖ్యం గురించి తెలియజేయడమే ప్రధాన లక్ష్యంగా జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు సూక్ష్మ స్వచ్ఛంద సంస్థ ఎ.ఎస్.కె.ఇండియా సొసైటీ నేషనల్ కంట్రోలర్ వి.స్టీఫెన్ తెలిపారు. ప్రతి ఏటా తాము నిర్వహించే పోటీల్లో మూడు లక్షల మందికి పైగా విద్యార్థులు పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. మొదట ఆయా పాఠశాల స్థాయిలో పోటీ నిర్వహించి అక్కడ ఎంపికైన వారితో జిల్లా, రాష్ట్ర, తుదిగా జాతీయ స్థాయిలో పోటీ ఏర్పాటు చేసి బహుమతులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఒకటో తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థుల వరకు వివిధ కేటగిరీల్లో పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆఖరు తేదీ డిసెంబరు 30 అని, మరిన్ని వివరాలకు 8056001200లో సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ వంశీకృష్ణ తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు 11 కేవీ శ్రీముఖి, భారత్ నగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాలు, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11కేవీ న్యూ శాస్త్రినగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాలు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11కేవీ ఎస్.ఆర్.ఆర్ పురం ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి

- **మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్**



కిష్టయ్య వర్ధంతి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బండా ప్రకాశ్ ముదిరాజ్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు

పంజాగుట్ట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మలిదశ తెలంగాణ ఉద్యమ పోరులో తొలి అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య ముదిరాజ్ విగ్రహాన్ని నగరంలో ప్రతిష్ఠించాలని, ఆయన వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్ అన్నారు. ప్రతీ సంవత్సరం లాగానే తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో డిసెంబరు 1న పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ వర్ధంతిని గన్‌పార్కు అమరవీరుల స్థూపం వద్ద నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. పాఠ్యపుస్తకాలలో ఆయన జీవిత చరిత్రను చేర్చాలని కోరారు. కార్యక్రమంలో మహాసభ ఉపాధ్యక్షులు బి.యాదగిరి ముదిరాజ్, పి.నారాయణ, పి.విజయ్ కుమార్ ముదిరాజ్, నాయకులు నీల రాజు, ఎం.ప్రభాకర్, కె.వెంకటేష్, బి.మనోజ్, చింతల ప్రకాశ్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో బీసీలకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య

పంజాగుట్ట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు విద్యా, ఉద్యోగ రంగాల్లోనూ, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చిందని, పొరుగు రాష్ట్రం సీఎంతో బహిరంగ సభలో చెప్పించి ప్రస్తుతం బీసీలకు తీవ్ర అన్యాయం, మోసం, దగా చేస్తోందని ఆల్ ఇండియా బ్యాక్ వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జస్టిస్ వి.ఈశ్వరయ్య ఆరోపించారు. స్థానిక ఎన్నికలపై న్యాయ, రాజకీయ పోరాటం చేస్తామని అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జీవో 46 తీసుకొచ్చి కేవలం 17 శాతం రిజర్వేషన్లు మాత్రమే స్థానిక ఎన్నికల్లో కల్పిస్తున్నారని అన్నారు. స్థానిక ఎన్నికలు నిలిపివేయాలని హైకోర్టులో పిటిషన్ వేయబోతున్నట్లు తెలిపారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు పొన్నం దేవరాజ్‌గౌడ్, రాఘవేందర్ ముదిరాజ్, రవీందర్, గంగాధర్, రాజ్‌కమల్, అంజన్న, తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్‌లో సివరేజీ లైన్ డైవర్షన్ చేయండి



జలమండలి ఎండీకి వినతిపత్రం ఇస్తున్న మహేందర్‌బాబు, రాజు

ఖైరతాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్‌లోని పలు బస్తీలు, కాలనీలకు చెందిన సివరేజీ భారీ పైప్‌లైన్‌ను డైవర్షన్ చేసి పాత ఎస్‌టీపీ లో కలపాలని కోరుతూ జలమండలి ఎండీ అశోక్ కుమార్‌కు టీపీసీసీ మాజీ కార్యదర్శి మహేందర్ బాబు, నాయకుడు రాజు తదితరులు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. తరచూ డ్రైనేజీ సమస్యలు వస్తున్నాయని తెలిపారు. పార్థివాడ, లక్ష్మీనగర్, మార్కెట్, జాగీర్దార్ బాడ, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని తెలిపారు. దీనికి పరిష్కారంగా నిజాం హయాంలో వేసిన పాత ఎస్ టీపీలోకి ఇక్కడి డ్రైనేజీ పైపలైన్‌ను కలపాలని కోరారు. ప్రస్తుతం ఉన్న కొత్త సచివాలయానికి 15 మీటర్ల కింద ఉన్న పాత ఏ మెయిన్ లైన్ కూరుకు పోవడంతో దానిస్థానంలో ప్రభుత్వ ముద్రణాలయం, మింట్ కాంపౌండ్ సచివాలయం పక్క నుంచి భారీ సివరేజీ పైపులైన్ వేసి దానిని ఎస్‌టీపీలోకి కలిపితే సివరేజీ ఫ్రీ ఫ్లో ఉంటుందని తెలిపారు. ఈ విషయమై పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని ఎండీ హామీ ఇచ్చారు.

జిల్లా ఆస్పత్రిలో ఎన్‌సీడీ విభాగం ప్రారంభం

గచ్చిబౌలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో ఎన్‌సీడీ విభాగాన్ని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో అన్ని రకాల వ్యాధులకు చికిత్స అందిస్తున్నారని, కొత్తగా మరికొన్ని వ్యాధులకు(సంక్రమిత) చికిత్స అందుబాటులోకి వచ్చిందన్నారు. డయాబెటిస్‌తో బాధపడుతున్న వారికి, బీపీ, కొలెస్ట్రాల్, క్యాన్సర్ వంటి వ్యాధులకు ఈ కేంద్రంలో చికిత్స, స్కానింగ్ చేస్తామని, అవసరమైతే పెద్ద ఆస్పత్రులకు పంపిస్తామని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ చంద్రకృష్ణ, కొండాపూర్ డీసీహెచ్ డాక్టర్ అనురాగినిరెడ్డి, ఎన్‌సీడీ కేంద్రం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మారేడుపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ కోరారు. బుధవారం తిరుమలగిరి మండలంలోని 27 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలు ఆడపిల్లల పెళ్లిళ్లు చేసి అప్పులపాలు కావద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా వివాహం చేసిన ప్రతి పేద కుటుంబానికి లక్షా 116 రూపాయలను అందజేస్తుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు మరింత త్వరగా మంజూరవుతున్నాయని తెలిపారు.



పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను కలిసిన ఐహెచ్ఆర్‌సీఐ బృందం

ప్రజల రక్షణ విషయంలో సహకరిస్తాం

అడ్డగుట్ట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజల రక్షణ విషయంలో పోలీసులకు తమ సంస్థ పూర్తిగా సహకరిస్తుందని జాతీయ మానవ హక్కుల కమిటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు కటకం శ్రీనివాస్ అన్నారు. సజ్జనార్‌ను బుధవారం ఐహెచ్ఆర్‌సీఐ బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాపితంగా తమ సభ్యులు పనిచేస్తున్నారని, హైదరాబాద్‌లో పోలీసులకు సహకరించేందుకు తమ సంస్థ పనిచేస్తుందన్నారు. సజ్జనార్‌ను కలిసి శాలువా కప్పి సన్మానించారు. సీపీని కలిసిన వారిలో ఐహెచ్ఆర్‌సీఐ జాతీయ కోశాధికారి డాక్టర్ సరపు తులసి, రాష్ట్ర మీడియా కమిటీ చైర్మన్ సామ శ్రీధర్, వంశికృష్ణ, రాములతో పలువురు సభ్యులు ఉన్నారు.



వ్యాపారులతో సమావేశమైన డీసీపీ రష్మీ పెరుమాళ్

దుకాణాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి : డీసీపీ

అడ్డగుట్ట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లోని నగలు, ఎలక్ట్రానిక్ దుకాణాల్లో సీసీ కెమెరాలు బిగించాలని నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ సూచించారు. బుధవారం నార్త్‌జోన్ కార్యాలయంలో సికింద్రాబాద్ నగల దుకాణ యజమానులు, హోటళ్లు, ఎలక్ట్రానిక్ దుకాణాల యజమానులతో జరిగిన సమావేశానికి డీసీపీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ నేరాలను నియంత్రించేందుకు పోలీసులు పకడ్బందీగా పనిచేస్తున్నారని, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత భద్రత చట్టం కింద దుకాణదారులకు సూచనలిస్తున్నామన్నారు. ప్రతి దుకాణాల్లో ప్రవేశ ద్వారం, కౌంటర్ల వద్ద ఇరవై నాలుగు గంటలూ సీసీ కెమెరాలు అందుబాటులో ఉంచాలి. అంతేకాకుండా నెల రోజుల పాటు బ్యాకప్ ఉండేవిధంగా ఏర్పాటుచేసుకోవాలి. ముఖ్యంగా బంగారు దుకాణాల్లో అలారం సిస్టమ్ ఉండాలన్నారు. దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల ఆధార్‌కార్డు, పూర్తి వివరాలు ప్రతి దుకాణ యజమాని వద్ద ఉండాలని సూచించారు. ప్రతి దుకాణం వద్ద సెక్యూరిటీ గార్డులు ఏర్పాటు చేసుకోవాలి. ఒక వేళ బంగారు బట్టల దుకాణాల్లో డిస్కౌంట్లు, ఈవెంట్లు నిర్వహిస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. దుకాణాలకు వచ్చే కస్టమర్లపై అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందన్నారు.



క్రిస్టియన్ డే ప్లే కార్డులు చూపుతున్న క్రైస్తవ ప్రతినిధులు

క్రిస్టియన్ డే వేడుకలు

రెజిమెంటల్‌బజార్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవ సమాజ సంక్షేమం, అభివృద్ధిలో భాగంగా బైబిల్ వాక్యానుసారం అపోస్తుల కార్యము క్రిష్టియన్ డే వేడుకలను బుధవారం సికింద్రాబాద్ మదర్ థెరిసా విగ్రహం వద్ద క్రైస్తవ నాయకులు, పాస్టర్లు జరుపుకున్నారు. సంస్థ వ్యవస్థాపకులు పివి యోహాను మాట్లాడుతూ దేశవ్యాప్తంగా క్రైస్తవుల దినోత్సవాన్ని 2016 నుంచి క్రైస్తవుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో క్రిస్టియన్ డే రూపకర్త వ్యవస్థాపకులు పివి యోహాను, గ్లోబల్ క్రిస్టియన్ లాబోర్డు ప్రధాన కార్యదర్శి రాజు భీమపాక, జాతీయ నాయకులు జెరుసలేం ముత్తయ్య, ఎన్‌సీసీ జాతీయ సెక్రటరీ బక్క ఏలియా, సురేందర్ గందం, చింతల ఏసన్న, మోహన్, చిట్టిబాబు, నాగభూషణం, విలియం, నిగేశ్‌పాల్‌లు పాల్గొన్నారు.



డా. వర్గీస్ కురియన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి, డెయిరీ ఉద్యోగులు

డా.వర్గీస్ కురియన్ 104వ జయంతి

తార్నాక, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : శ్వేత విప్లవ పితామహుండు పద్మ విభూషణ్ డా.వర్గీస్ కురియన్ 104వ జయంతిని పురస్కరించుకుని విజయా డెయిరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి బుధవారం డెయిరీ ఉద్యోగులతో కలిసి లాలాపేట్‌లోని విజయా డెయిరీ ప్రధాన కార్యాలయంలో డా. వర్గీస్ కురియన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డైయిరీ జీఎం మధుసూదన్, కవిత, మల్లయ్య, కామేష్, మల్లిఖార్జున్ రావు, మోహన్, మురళి, లావణ్య, ప్రసన్న, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



పికెట్ చౌరాస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్, సంకి రవీందర్, ముప్పిడి మధుకర్, మారుతి, శేఖర్, సత్యనారాయణ, ఉత్తరయ్య, గోవింద రాజు



సీతాఫల్‌మండిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ సామల హేమ తదితరులు



బాపూజీనగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జంపన ప్రతాప్ తదితరులు

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

బౌద్ధనగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ సామల హేమ ముఖ్యఅతిథిగా పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శైలేందర్, కృష్ణముది రాజ్, లక్ష్మీ, అనిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొన్న జక్కుల మహేశ్వర్ రెడ్డి



రాజ్యాంగ ప్రవేశికను చదువుతున్న చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (సీఈఈ) డీవీఎస్ రాజు

బోయినపల్లిలో..

బోయినపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం కంటోన్మెంట్ బోయినపల్లిలోని బాపూజీనగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, కరణ్ సింగ్, కృష్ణ, అజిత్, రామారావు, గోమతి తదితరులు పాల్గొన్నారు

- రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం బోయినపల్లి పోలీస్ స్టేషన్ చౌరాస్తాలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నర్సింగరావు, మధు, రాజు, కిషోర్, రాజేష్, అనిల్, నరేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



లాలాగూడ రైల్వేస్టేషన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం కేవీన్ సుధాకర్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నగేష్, సత్యనారాయణ, శ్రీకాంత్‌లు

మెట్రోభవన్‌లో

హైదరాబాద్ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రసూల్‌పురాలోని మెట్రో రైల్‌భవన్‌లో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (సీఈఈ) డీవీఎస్ రాజు.. భారత రాజ్యాంగ ప్రవేశికను చదివారు. అలాగే అధికారులు, ఉద్యోగులతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు.

తార్నాకలో..

తార్నాక, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ దినోత్సవంలో భాగంగా సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి యాదవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం తార్నాకలోని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో డా. అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బరిగల స్వరూపారాణి, మహ్మద్ రిజ్వాన్ హుస్సేన్, మహ్మద్ వజీద్ సిద్దిఖీ, మహ్మద్ పాషా, ఇయాన్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగ ప్రవేశికను చదువుతున్న రైల్వే జీఎం శ్రీవాస్తవ, పక్కన అదనపు జీఎం, ఉన్నతాధికారులు

దక్షిణమధ్య రైల్వేలో

హైదరాబాద్ సిటీ: దక్షిణమధ్యరైల్వే జోన్ పరిధిలోని అన్ని కార్యాలయాల్లో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. రైల్ నిలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, అదనపు జీఎం సత్య ప్రకాష్, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగ ప్రవేశికను జీఎం శ్రీవాస్తవ చదివి వినిపించారు. జోన్ అంతటా ఉన్న ఆరు డివిజనల్ కార్యాలయాలు, పీఎస్‌యూలు, వర్క్‌షాప్‌లలోనూ రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకున్నట్లు సీపీఆర్ఓ శ్రీధర్ వెల్లడించారు.



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి యాదవ్ తదితరులు

ఆక్రమణల జాబితా సిద్ధం చేస్తున్న కంటోన్మెంట్ బోర్డు

సికింద్రాబాద్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ప్రజలకు ఇబ్బందులు కలుగచేస్తున్న ఆక్రమణదారుల జాబితాను అధికారులు సిద్ధం చేస్తున్నారు. సాధారణ ప్రజలకు, ముఖ్యంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఆక్రమణలను ఏమాత్రం ఉపేక్షించేది లేదని, వాటిని నేలమట్టం చేసి తీరతామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇటీవల ప్రకటించిన మేరకు ప్రభుత్వ స్థలాలు, పార్కులు ఫుట్‌పాత్‌లు, నాలాలను ఆక్రమించిన కట్టడాలను తొలగించడానికి సన్నద్ధమవుతున్నారు. వారం రోజుల్లో ఆక్రమణదారులు వారికి వారే సొంతంగా ఆక్రమణలను తొలగించుకుంటే మంచిదని, లేనిపక్షంలో తామే తొలగించి, దానికైన ఖర్చును సైతం వారినుంచి వసూలు చేస్తామని ఇటీవల సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం పబ్లిక్ నోటీసు జారీ చేసిన సంగతి విదితమే. ఈ పబ్లిక్ నోటీసునే తుది నోటీసుగా పరిగణించాలని బోర్డు అధికారులు స్పష్టం చేశారు. దీనిలో భాగంగా కంటోన్మెంట్‌లోని 8 వార్డుల్లోని కాలనీలు, బస్తీల్లో, ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లలో సాధారణ ప్రజానీకాన్ని ఇబ్బందులు పాలు చేస్తున్న ఆక్రమణల జాబితాను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఆక్రమణల తొలగింపు పట్ల అధికారులు ఖచ్చితంగా వ్యవహరిస్తారా, ఎటువంటి ఆక్రమణలు తొలగిస్తారు, ఏయే ప్రాంతాల్లోని ఆక్రమణలను తొలగిస్తారు అనే అంశమై అటు రాజకీయ వర్గాల్లో, ఇటు సాధారణ ప్రజానీకంలో ఆసక్తి నెలకొన్నది. ఇదిలా ఉండగా ఆక్రమణల తొలగింపు పేరిట నిరుపేదల జోలికి వెళ్లవద్దంటూ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేశ్, కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మదలు ఈపాటికే పలు మార్లు సికింద్రాబాద్ కంటోన్మెంట్ సీఈఓ అర్వింద్‌కుమార్ దివేదీకి సూచించారు. వారి సూచనలను సీఈఓ ఏ మేరకు పరిగణలోకి తీసుకుంటారనే విషయం కూడా ఆసక్తిగా మారింది.



సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ఏఎస్‌రావునగర్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని ఈసీఐఎల్ చౌరస్తాలో కుషాయిగూడ పోలీసులు బుధవారం నిర్వహించారు. బైకిస్టులు హెల్మెట్, కార్లు నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో కుషాయిగూడ ఏసీపీ వై.వెంకటరెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రుద్వీర్ కుమార్, ఎస్సైలు సుధాకర్‌రెడ్డి, మధు, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

పాపారావుకు డాక్టరేట్ ప్రదానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ విద్యార్థి నాయకుడు సాగబోయిన పాపారావు.. ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ విభాగంలో డాక్టరేట్ పొందారు. ప్రొఫెసర్ విష్ణుదేవ్ పర్యవేక్షణలో 'సబ్-ప్లాన్ అండ్ ట్రైబల్ డెవలప్మెంట్ - ఎ సోషియలాజికల్ స్టడీ ఆఫ్ ఐటీడీఏ భద్రాచలం ఇన్ తెలంగాణ స్టేట్' పై పరిశోధన పూర్తి చేశారు. ఆ మేరకు ఓయూ అధికారులు ఆయనకు పీహెచ్ పట్టా ప్రదానం చేశారు. వందేళ్ల ఓయూ సోషియాలజీ విభాగం చరిత్రలో పీహెచ్‌ఏ అవార్డు పొందిన మొదటి ఆదివాసీ పరిశోధక విద్యార్థిగా పాపారావు ఘనత సాధించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.



పరిశోధన గ్రంథాన్ని అందజేస్తున్న పాపారావు

హైడ్రా ఆధ్వర్యంలో పార్క్ స్థలానికి కంచె

మచ్చబొల్లారం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మచ్చబొల్లారం డివిజన్ గంగా ఎవెన్యూ కాలనీలో ఉన్న పార్కు స్థలానికి హైడ్రా ఆధ్వర్యంలో బుధవారం కంచె నిర్మించి, బోర్డు ఏర్పాటు చేశారు. ఈ స్థలం రూ. 10 కోట్ల విలువ ఉంటుందని కాలనీవాసులు తెలిపారు. విషయానికొస్తే.. గంగా ఎవెన్యూ కాలనీకి సంబంధించి 21, 576 (పి), 577 సర్వే నంబర్‌లో 2,400 గజాల పార్కు స్థలం ఉంది. కొంత మంది ఆక్రమణ దారులు కబ్జాకు యత్నించిగా ఈ విషయం పై కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వర్ ఆధ్వర్యంలో చదును చేసి కంచె నిర్మించారు. దీనిపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కళాకారుల నృత్యాలు అదరహో

అల్వాల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, గోవా, దాద్రా నగర్ హవేలీ, డామన్ డయ్యూల చెందిన కళాకారుల నృత్యాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రాష్ట్రపతి నిలయంలో నిర్వహిస్తున్న భారతీయ కళా మహోత్సవం బుధవారం ఐదో రోజుకు చేరింది. 14 వేల మంది సందర్శకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పశ్చిమ రాష్ట్రల సంప్రదాయ చేనేత వస్త్రాలు, హస్తకళలు, గిరిజన కళ, ప్రాంతీయ వంటకాలతో పాటు జానపద నృత్యాలు సందర్శకులను అబ్బురపరిచాయి. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.బాలాచారి రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించి రాష్ట్రపతి నిలయంకు తెలుగు పుస్తకాలను ఎస్టేట్ మేనేజర్ డాక్టర్ రజనీ ప్రియాకు అందజేశారు.



మహిళల సదస్సులో పాల్గొన్న నార్త్‌జోన్ అదనపు డీసీపీ అశోక్‌తో పాటు మహిళలు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

అడ్డగుట్ట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : చిన్న విషయాలు, కక్షల కారణంగా నేరాలతో పాటు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మహిళల్లో ఓపిక ఎంతో అవసరమని సికింద్రాబాద్ నార్త్‌జోన్ అదనపు డిప్యూటీ కమిషనర్ అశోక్ సూచించారు. బుధవారం అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రాం కమ్యూనిటీహాలులో తెలంగాణ పోలీస్ సహకారంతో సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఎంపవర్‌మెంట్ ఫర్ ఉమెన్(సీడీఈడబ్ల్యూ) ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళల సమస్యలపై అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలో జరిగే చిన్న గొడవలకే ఆత్మహత్యలు పాల్పడుతున్నారని, ఓపిక ఉంటే సమస్య అప్పటికప్పుడు పరిష్కారం అవుతుందని సూచించారు. రుద్రవీణ మహిళా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు నక్కల శోభ మాట్లాడుతూ ఎక్కడ చూసిన మహిళల ఆత్మహత్యలు, హత్యలు జరుగుతూనే ఉన్నాయని, చట్టాల్లో హక్కులు తెలుసుకునేందుకు మహిళలు కృషి చేయాలన్నారు కార్యక్రమంలో తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డీఐ శ్రీనివాస్, బేగంపేట్ మహిళ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జ్యోతి, ఏఎస్ఐ సంజీవరాణి, బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, రుద్రవీణ మహిళా సంఘం అధ్యక్షురాలు శోభ, సిడిఈడబ్ల్యు అడ్మిన్ కౌన్సిలర్ మంజు, విజయ, సుమతి, సవితల ప్రతినిధులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న హెచ్‌డీసీ డైరెక్టర్ విజయ చరణ్

పోటీ యుగంలో ఆప్టిట్యూడ్ నైపుణ్యం కీలకం

- హెచ్‌సీడీసీ డైరెక్టర్ విజయ చరణ్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : నేటి పోటీ యుగంలో విద్యార్థుల ఉద్యోగ ప్రయాణంలో ఆప్టిట్యూడ్ నైపుణ్యాలు కీలకమని హ్యూమన్ క్యాపిటల్ డెవలప్మెంట్ సెంటర్ (హెచ్‌సీడీసీ) డైరెక్టర్ ప్రొఫెసర్ జి.విజయ చరణ్ పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ హెచ్‌సీడీసీ ఆధ్వర్యంలో "అర్థమెటిక్ అండ్ లాజికల్ రీజనింగ్"పై మూడు రోజుల ట్రైనింగ్ ప్రోగ్రామ్ బుధవారం సీఎఫ్ఆర్‌డీ భవనంలోని ఈ-క్లాసరూంలో ప్రారంభమైంది. 250 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. కేవలం మార్కులే కాదు.. సమస్య పరిష్కార సామర్థ్యం, లాజికల్ థింకింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, క్విక్ డిసిషన్ మేకింగ్ వంటి వాటినే కంపెనీలు కోరుతున్నాయని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న షార్ట్‌కట్ టెక్నిక్స్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌డీసీ కోఆర్డినేటర్ డా. సూర్యవల్లి తెలిపారు.

ఏఐఎస్ఎఫ్ ఓయూ కమిటీ అధ్యక్షుడిగా ఉదయ్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలో రెండు రోజులుగా జరుగుతున్న ఏఐఎస్ఎఫ్ 25వ మహాసభలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఓయూ నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఉప్పల ఉదయ్, కార్యదర్శిగా లెనిన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమిటీలో సహాయ కార్యదర్శులుగా అశ్విన్, భగత్, ఉపాధ్యక్షులుగా దొండి రామ్, రమేష్, కోశాధికారిగా శ్రీశైలం, సభులుగా మహేష్, సుమన్, మధు, రాఘవేంద్ర ఎంపికయ్యారు.



శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి



పూజలు చేస్తున్న అర్చకులు, ఆలయ ట్రస్ట్ సభ్యులు



వేడుకల్లో పాలకమండలి సభ్యులతో మంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేశ్, పాలకమండలి సభ్యులు, ముఖ్య నాయకులు

వైభవంగా సుబ్రహ్మణ్య షష్ఠి వేడుకలు

పద్మారావునగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పద్మారావునగర్‌లోని స్కందగిరి సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో బుధవారం సుబ్రహ్మణ్య షష్ఠిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మహన్యాసం, ప్రత్యేక హోమం, సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం నిర్వహించారు. వందలాది భక్తులు ఆలయానికి చేరుకోవడంతో ఆలయ పరిసరాలు భక్త జనసందోహంతో కిక్కిరిసిపోయాయి. ప్రధాన అర్చకుల మంత్రోచ్చారణల నడుమ వేడుకలను ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి.ఎల్.వి.సుబ్రమణ్యం, మేనేజింగ్ ట్రస్టీ కృష్ణన్ రాజమణి, తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, గుర్రం పవన్‌కుమార్ గౌడ్, నాగులూరి కృష్ణకుమార్ గౌడ్, నాగులూరి అరుణ్‌కుమార్ గౌడ్, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మారేడుపల్లిలో..

మారేడుపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మారేడుపల్లి సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో బుధవారం సుబ్రహ్మణ్యస్వామి షష్ఠిని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్రమంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్, కార్పొరేటర్ కొంతం దీపిక, కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ భానుక నర్మదా మల్లిఖార్జున్, విద్యాశాఖ డైరెక్టర్ రాధారెడ్డి, రవి శేఖర్ రెడ్డి దంపతులు, సీఐ వెంకటేశం పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సికింద్రాబాద్, కంటోన్మెంట్ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఆలయ ఈఓ జి. సుధాకర్, పాలక మండలి చైర్మన్ రేపాల వెంకటటేశ్వర్లు, కమిటీ పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు ముఖ్య నాయకుడు ముప్పిడి గోపాల్, కృష్ణ యాదవ్, టి ఎన్ శ్రీనివాస్, సంతోష్ యాదవ్, బద్రీనాథ్ యాదవ్, నాగేష్ యాదవ్, ముప్పిడి మధుకర్, ప్రధాన అర్చకులు రాజరాజేశ్వర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



భక్తులతో కిటకిటలాడిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం

వృద్ధురాలి అదృశ్యం

బౌద్ధనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సీతాఫల్‌మండి మేడిబావికి చెందిన ఎన్.బాలమణి(75) 25న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. వృద్ధురాలి కోసం కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించినా ఫలితం లేదు. దీంతో కుమారుడు వెంకటేశ్ తన తల్లి కనపించటం లేదని మంగళవారం రాత్రి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బాలమణి